# పిచ్చి తల్లి

– నోరి రాధిక

విమానంలో కూర్చుందే కానీ మనసంతా ఇంటి దగ్గరే వుంది మానసికి. 'బేబీ ఏం చేస్తోందో! పాపం, తనని చూడగానే ఎంత సంతోషపడిపోయిందో! మళ్ళీ తను ఎప్పుడు ఇండియా వెళ్ళగలుగుతుందో! ఎప్పుడు తన బేబీని చూడగలుగుతుందో! అక్కడ తన బాబు ఎలా వున్నాడో! వాడు తను లేదని ఎంత గొడవ చేస్తున్నాడో! ఈయన్ని ఎన్ని తిప్పలు పెడుతున్నాడో! ఏమిటో, తన జీవితం, ఇలా కొడుకు, కూతురు వుండి కూడా ఎవరో ఒకరినే తన దగ్గర వుంచుకుని ఇంకొకరి ఎడబాటు అనుభవించే దుర్గతి పట్టింది తనకి. ఈ పరిస్థితి ఎప్పటికి చక్కపడుతుందో, ఏమిటో'! ఇలా ఆలోచనలలో మునిగిపోయిన మానసి పక్కావిడ తనను తట్టి ఏదో అడుగుతుంటే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. "చాలా సేపటి నుండి వుత్తగా ఇలా కూర్చుని వున్నాం. విమానం గాలిలోకి ఎగరటంలేదేమిటి? నీకేమన్నా తెలుసా అమ్మా?" అంటూ తన పక్క సీటులో కూర్చున్న ఒక పెద్దావిడ అడుగుతోంది మానసిని. మానసి అప్రయత్నంగా ఆవిడని ఒక్కసారి తేరిపార చూసింది. ఆవిడ వయసు **65** దాటి వుండచ్చు. కానీ కష్టాలలో కుంగడం వల్ల కావచ్చు, ఇంకా ఎక్కువ వున్నట్లు అనిపిస్తోంది. తలంతా తెల్లగా ముగ్గు బుట్టలాగా అయిపోయింది. శరీరం వృద్ధ్యాప్యంలో ముడతలు పడ్డా పసుపు రాసినట్లు పచ్చగా మెరుస్తోంది. మనిషి చాలా నిదానంగా, మాట చాలా సౌమ్యంగా వుంది. తన ఆలోచనలలో గాఢంగా మునిగిపోయి అసలు అంతవరకూ విమానం చలనం లేకుండా అక్కడే వుందన్న విషయమే మానసి గమనించలేదు. వెంటనే ఒక్కసారి ఉలిక్కిపడి 'తెలీదు ఆంటీ. కనుక్కుంటాను వుండండి' అంటూ **airhostess** ని పిలిచి కారణం అడిగింది. ఆ తర్వాత ఆవిడతో చెప్పింది, 'ఎవరో సామాను **check in** చేసేసి వారు ఎక్కలేదట. అందుకని **load** చేసిన సామానంతా **unload** చేసి ఆ **luggage** ని **locate** చేసి, మిగిలిన సామానంతా మళ్ళీ **load** చేస్తున్నారట. అందుకే ఈ ఆలస్యం అవుతోంది" **airhostess** దగ్గర నుండి సేకరించిన వివరాలన్నీ ఆవిడతో వివరంగా చెప్పింది మానసి.

'సామాను ఎక్కించేసి వారెందుకు ఎక్కలేదో! దీనివల్ల మనందరికీ అనవసరంగా ఆలస్యం అవుతోంది' అనుకుంటూ గొణుక్కుంది ఆవిడ. తర్వాత మానసి వైపు తిరిగి "నువ్వెక్కడదాకా వెళుతున్నావమ్మా?" అని అడిగింది మళ్ళీ. మానసి **"connecticut** కి వెళుతున్నాను ఆంటీ. మేం అక్కడ వుంటాం. మీరెక్కడికి వెళుతున్నారు?" అన్నది. "**New York** దగ్గర అదేదో వూళ్ళో మా అమ్మాయి, అల్లుడు వుంటారు. మా అమ్మాయి మొదటిసారిగా తల్లి కాబోతోంది. బలహీనంగా వుందని డాక్టరు **rest** కావాలన్నాడట. అందుకని ఏదో కాస్త సహాయంగా వుంటుందని నేను వెళ్తున్నాను. ఎంతదాకా పని చేయగలనో, లేదో తెలీదు. కానీ ఏదో, ఆడపిల్ల కదా, చేతనైనంత వరకూ కాస్త సహాయం చేద్దామని....." అంటూ ఆవిడ మెల్లిగా చెప్పింది. మానసి ఆవిడ మాటలు వింటూ 'ఇంత బలహీనంగా వున్నారు. ఈవిడ ఇతరులకు ఏం సహాయం చేయగలరు? అక్కడకు వెళ్ళిన తర్వాత జబ్బు పడి తను వేరేవారి చేత సేవలు చేయించుకోకపోతే అంతే చాలు' అనుకుంది మనసులో. ఇలా ఎవరి ఆలోచనలలో వారు వున్నారు. సుమారు మూడు గంటలు గడిచిపోయాయి. విమానంలో అంతా గలభాగా వుంది. చిన్నపిల్లల ఏడుపులు, పెద్దవాళ్ళ మాటలు కలగాపులగంలా, గోలగా వినిపిస్తున్నాయి. అందరికీ విమానం ఎప్పుడు బయల్దేరుతుందా అని ఆతురతగా వుంది. చివరికి ఎలాగైతేనేం, కాస్సేపటికి విమానం గాలిలోకి లేచింది. అందరూ అమ్మయ్య అనుకున్నారు. కానీ ఒక గంట తర్వాత వీళ్ళందరూ **Bombay** చేరేసరికి, ఆలస్యం అయినందు వలన అక్కడి నుండి లండను వెళ్ళే **connecting flight** అప్పటికే వెళ్ళిపోయింది. **Airport** లో ప్రయాణీకులందరూ గొడవ చేస్తున్నారు. మళ్ళీ **next flight** మరుసటి రోజు కానీ లేనందు వలన ప్రయాణీకులందరినీ **airlines** వాళ్ళు **Bombay**లో ఒక **hotel** లో పెట్టారు. **luggage** అంతా **pickup** చేసుకుని ఆ **hotel** వాళ్ళ **bus** లో **hotel** చేరేసరికి మానసి బాగా అలిసిపోయింది. ఆమె తన రూములోకి వెళ్ళబోతూ వుంటే బయట లాబీలో ఏవో మాటలు వినిపించి అటువైపు చూసింది మానసి. విమానంలో తన పక్కన కూర్చున్న పెద్దావిడ **hotel** లో పని చేసే ఒకాయనతో ఏదో అంటూ కనిపించింది. మానసికి హఠాత్తుగా ఒక అనుమానం వచ్చింది, ఆవిడకి హిందీ, ఇంగ్లీషు భాషలు బహుశా వచ్చి వుండవు. మరి ఎవరితోనన్నా ఇంక **communication** ఎలాగ? ఈ ఆలోచన రాగానే మానసి అంత అలసటలోనూ లేని ఓపికని ఎలాగో తెచ్చుకుని గబగబా లాబీలోకి వెళ్ళింది. ఆమె అనుమానం నిజమే! ఆ పెద్దావిడ మిగిలిన ప్రయాణీకులందరితోనూ కలిసి రాకపోవటం వలన ఏ **flight** లో వచ్చిందో నిర్ధారణ కోసం ఆమెని **ticket** చూపించమంటున్నారు. భాష తెలియకపోవటం వలన వాళ్ళేమడుగుతున్నారో ఆమెకి అర్థం కావటంలేదు. మానసి కల్పించుకుని జరిగినదంతా వారికి వివరించి, పరిస్థితినంతా చక్కబరిచి, ఆవిడకి ఇంకో రూమ్ ఇప్పించి తన గదికి వెళ్ళేసరికి చాలా ఆలస్యం అయింది. హైదరాబాదు ఫోను చేసి తనవారితో మాట్లాడింది. బేబీ తనకోసం అడిగి, కాసేపు ఏడ్చి, అలిసిపోయి నిద్రపోయిందట. మానసికి గుండెలు పిండేనంత బాధ కలిగింది. 'అయ్యో, నా చిట్టితల్లీ' అనుకుంది ఎంతో బాధగా. **Connecticut** కి ఫోను చేసి తనింకా **Bombay** లోనే వున్నానని చెప్పింది. బాబుకి క్రితం రోజునుండీ జ్వరంగా వుందిట. అందుకని మానసి వాళ్ళాయన ఆఫీసుకి వెళ్ళకుండా ఇంట్లోనే వున్నాడట. ఈ విషయం విన్నప్పటి నుండీ మానసికి మనసు మనసులో లేదు. ఎప్పుడెప్పుడు కొడుకు దగ్గరకు వెళ్దామా అని తగని ఆత్రంగా వుంది. ఇండియాలో కూతురు, అమెరికాలో కొడుకు, ఇద్దరినీ తన దగ్గర వుంచుకునే అదృష్టం తనకు లేదు. భగవంతుడా! ఏమిటి తనకీ శిక్ష? మనశ్శాంతి లేక మానసి ఆ రాత్రి సరిగ్గా నిద్ర పోలేకపోయింది. మర్నాడు మళ్ళీ అందరూ **hotel** వాళ్ళ **bus** లో **airport** కి వెళ్ళారు. ఆ పెద్దావిడ తన **luggage** తో అవస్థలు పడుతూంటే మానసి ఆవిడకి సహాయం చేసింది. **London flight** లో కూడా ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. అప్పుడు చెప్పింది ఆవిడ. అసలెందుకు **Bombay** లో ఒక రాత్రి వుండిపోవాలంటున్నారో ఆవిడకు మొదట అర్థం కాలేదట. హైదరాబాదులో వేసిన **luggage New York** లో కానీ **pickup** చేసుకోనక్కర లేదు అని కొడుకు చెప్పినా వీళ్ళందరూ **luggage** ఎందుకు తీసుకోమంటున్నారో తెలియక, పాపం, కాస్సేపు తికమక పడిందట. తీరా ఆవిడకి అర్థం అయ్యేసరికి **hotel bus** వెళ్ళిపోవటం వలన మళ్ళీ **shuttle** వచ్చేవరకూ ఎదురు చూసేసరికి ఆలస్యం అయిందట. "రాత్రి **hotel** లో డిన్నరు కూపను తీసుకున్నారా ఆంటీ? ఏం తిన్నారు?" అని మానసి అడిగితే "కూపనంటే ఏమిటమ్మా?" అని అడిగింది ఆవిడ ఎంతో అమాయకంగా. "అయ్యో! ఆంటీ! డిన్నరుకి కూపను ఇచ్చారు. మీరు తీసుకోకపోతే మరి భోజనం ఏం చేసారు?" అని అడిగింది మానసి. "పెద్దగా ఆకలి అనిపించలేదు. ఇంటి నుండి తెచ్చుకున్న కారప్పూస కాస్త వుంటే కొంచెం తిన్నాను" అంది ఆవిడ మళ్ళీ అమాయకంగా. మానసికి ఆవిడను చూస్తే ఎంతో జాలి కలిగింది. ఆవిడ మెల్లిగా తన కథంతా క్లుప్తంగా చెప్పింది మానసికి. ఆవిడ పేరు తల్లమ్మ. భర్త ఏదో గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తాగా పని చేసి రిటైరయ్యాడు. వాళ్ళకి ఒక కూతురు, కొడుకు. కొడుక్కి పెళ్ళయింది. ఒక మనవడు. కూతురికి చాలా ఏళ్ళు పెళ్ళి కుదరక చివరికి ఒక అమెరికా సంబంధం వాళ్ళు ఒప్పుకుంటే ఆలస్యం అయినా మంచి సంబంధం అని, ఇన్నాళ్ళకి అసలు తమ అమ్మాయికి పెళ్ళంటూ కుదిరిందని, తమ తాహతుకి మించినదైనా ఆ సంబంధం ఒప్పుకున్నారు. వియ్యాలవారి హోదాకి తగ్గట్లుగా అన్ని హంగులతోనూ ఘనంగా పెళ్ళి చేసి అప్పుల పాలయ్యారు. తాహతుకి మించిన ఎత్తుకి ఎగిరారని, వున్నదంతా కూతురి కోసం ఖర్చు చేసి కొడుకుని, అతని కుటుంబాన్ని అశ్రద్ధ చేసారని, కోడలుకి, కొడుక్కి వారి మీద కోపం. "తాహతు మించినదైనా మంచి సంబంధం చేయటం ముఖ్యం కదమ్మా! ఆడపిల్ల సుఖంగా వుండటం కావాలి. మన అప్పులు మెల్లిగా తీర్చుకోవచ్చు. డబ్బు కోసం చూసి పిల్ల భవిష్యత్తుకి అడ్డేలా చెప్తాం?" అంది ఆవిడ. మధ్య తరగతి కుటుంబాలలో వుండే డబ్బు సమస్యలు ఇవన్నీ. బాధాకరమైన విషయం

ఏమిటంటే ఈ డబ్బు సమస్యలు ఎంత తాత్కాలికమైనా కుటుంబాలలో శాశ్వత కలహాలను రేపుతాయి.

"మొదటిసారి అమ్మాయి తల్లి కాబోతోంది. తల్లిగా కనీసం మొదటి పురుడన్నా పోయటం నా బాధ్యత. నాకు ఓపిక లేదు, పని చెయ్యలేను, ప్రయాణం అంతకంటే చెయ్యలేనని మా అబ్బాయి నన్ను వెళ్ళొద్దన్నాడు. కానీ అమ్మాయి టిక్కెట్టు పంపించింది. అవతల వాళ్ళ అత్తగారి ఇంట్లో దానికి చిన్నతనంగా వుండకూడదు కదా! ఇవన్నీ వుడుకు రక్తం వాడు, మా అబ్బాయికి అర్థం కావు. అందుకే మా ఆయన, నేను ఇంట్లో కొడుకు, కోడలికి ఇష్టం లేకపోయినా, నా ప్రయాణ సన్నాహాలు చేసుకున్నాము. ఒక్క ఆరు నెలల పాటు, ఏదో, నాకు తోచిన సహాయం చేస్తాను దానికి" అంది ఆవిడ మెల్లిగా. మానసికి ఇదంతా వింటూ వుంటే ఆవిడంటే ఇంకా ఎక్కువ జాలి కలిగింది. "ఇంత బలహీనంగా వున్నారు. ఏం సహాయం చేయగలరు ఆంటీ మీరు?" అని మానసి అడిగితే "ఫరవాలేదులే అమ్మా! ఇంటి పనేమీ కాకపోయినా కనీసం బిడ్డ పని అయినా కూర్చుని చేయగలను కదా! అది పెద్ద సహాయమే కదా! పైగా పని సంగతి అటుంచి ఏదో, అమ్మని, నన్ను దగ్గర చూస్తేనే చాలు, నా పిచ్చి తల్లికి కొండంత బలం వస్తుంది" అంది ఆవిడ. నిజమే కదా! మన స్వార్థం కోసం కానీ, వేరే ఇంక మార్గమేదీ లేక కానీ, మన తల్లి తండ్రుల దగ్గర నుంచి మనం వాళ్ళ చరమాంకంలో కూడా ఇంకా సహాయాలు ఆశిస్తాము. వాళ్ళు కూడా చేయటానికి సిద్ధపడతారు. ఇది పిల్లల మీద వాళ్ళకున్న ప్రేమ వలన కానీ, పాపం, వాళ్ళకి ఇంకా శక్తి వుందని కాదు.

"నీ పిల్లలేరమ్మా? మీవారు లేకుండా ఒక్కతివే ఇండియా వెళ్ళావెందుకు?" అని అడిగింది ఆవిడ. మానసికి తన ఇల్లు, పిల్లలు గుర్తొచ్చారు. "నాకు కూడా ఒక కొడుకు, కూతురు ఆంటీ! కూతురుకి నాలుగేళ్ళు. కొడుక్కి మూడేళ్ళు. వెంటవెంటనే ఇద్దరు పిల్లలు, అమెరికాలో పని వారి సహాయం అంటూ ఏదీ వుండదు. నాకు ఆర్థికరీత్యా వుద్యోగం చేయక తప్పదు. ఇద్దరు పిల్లలను చూసుకోవటం కష్టమని మా అమ్మాయిని ఇండియాలో మా పుట్టింట్లో వదిలాను. దానికి జ్వరంగా వుంది, ఒంట్లో బాగాలేదని మావాళ్ళు ఫోను చేస్తే మనసాగక ఇండియాకి పరిగెత్తాను. ఉద్యోగం కదా! ఎన్ని రోజులని వుండగలను? పైగా మావారి దగ్గర చంటి పిల్లాడిని కూడా వదిలి వచ్చాను కదా! అందుకని మళ్ళీ అమెరికా వెళ్ళిపోతున్నాను. ఇప్పుడు వాడికి కూడా జ్వరంగా వుందిట" చెప్తుంటే మానసికి కళ్ళ నిండుగా నీళ్ళు వచ్చేసాయి. వింటున్న తల్లెమ్మ ఓదార్పుగా మానసి భుజం తట్టింది. "బాధ పడకమ్మా! చెరో ప్రాణం చెరో చోట పెట్టావు. మధ్యలో నలుగుతున్నావు. అంతా ఆ భగవంతుడి మీద భారం పెయ్యి. అంతా ఆయనే చూసుకుంటాడు" అంది అనునయంగా మానసి చుట్టూ తన చేతులు వేస్తూ. మానసి మౌనంగా తలూపింది. గాలి తగిలితే వర్షించబోయే మబ్బులాగా వుంది ఆమె పరిస్థితి. బలవంతాన ఏడుపు ఆపుకుంటోంది. చాలీచాలని డబ్బుతో అనుక్షణం పోరాటంగా ఈ మధ్య తరగతి జీవితాలని ఎందుకు సృష్టిస్తాడు ఈ దేవుడు అనుకుంది మనసులో. పోనీ ఎక్కువ మందిని కని పెంచే స్తోమతు లేదు కాబట్టి ఒక బిడ్డతోనే సరిపెట్టుకుందామనుకుంటే రేపు మనం లేకుండాపోయినపుడు వారికి ఒకరికొకరు తోడు వుంటారని కనీసం ఇద్దరు పిల్లలన్నా కావాలనుకున్నారు. కానీ కరువు రోజులు. ఎంత సంపాదించినా చాలదు. అసలే భర్తది అంత నిలకడ వున్న వుద్యోగం కాదు. ఇంక తను కూడా వుద్యోగం మానేస్తే ఇల్లు గడవటం కష్టం. పోనీ పిల్లలని **daycare** కి పంపుదామంటే అది కూడా అంత చవకేమీ కాదు. మంచి **quality care** కావాలంటే చాలా ఖరీదే! పోనీ ఇవన్నీ ఆలోచించి ఆర్థికంగా పరిస్థితి కాస్త మెరుగయ్యేదాకా పిల్లల్ని కనటం **postpone** చేద్దామనుకుంటే **biological** గా ఏమన్నా సమస్యలొస్తాయేమోనని భయం. వద్దనుకున్నపుడు మానేసి, కావాలనుకున్నపుడు కనటానికి ఇది మానవ శరీరం కానీ, ఏమన్నా స్విచ్ నొక్కగానే తిరిగే మెషీనా? అందుకే తొందరపడి ఇంకో బిడ్డని కన్నది. కానీ బాబు పుట్టిన తర్వాత మాత్రం తనకి పుట్టింటి సహాయం తీసుకోక తప్పలేదు. అందుకే బేబీని వారి వద్ద వదిలింది. కానీ ఒకరి దగ్గర వున్నపుడు ఇంకొకరిని బాగా **miss** అవుతోంది. ముఖ్యంగా వారికి ఆరోగ్యం బాగాలేదు అంటే తన తల్లి ప్రాణం తట్టుకోలేకుండా వుంది. ఆలోచనలతో మళ్ళీ తలనొప్పి వచ్చింది ఆమెకి. కళ్ళు మూసుకుని పడుకోవటానికి ప్రయత్నించింది. ఇంతలో లండను చేరారు. **Aircraft clean** చేయటానికి ఒక రెండు గంటలసేపు అందరినీ కిందకు దిగమన్నారు. మానసి మళ్ళీ ఇండియాకి, అమెరికాకి ఫోను చేసి వచ్చింది. పిల్లలెలా వున్నారో కనుక్కుంది. **Airport** లో తమ కౌంటర్ దగ్గర చాలా హడావిడిగా వుంటే ఏమిటో కారణం కనుక్కుంటే తెలిసింది, తాము ప్రయాణం చేసి వచ్చిన విమానం ఇంజను పాడయిందట. ఆరోజు ప్రయాణీకులందరినీ లండనులోనే ఒక **hotel** లో వుంచుతారట. 'అబ్బా! మళ్ళీనా!' అనుకుంది మానసి. పిల్లాడి దగ్గరకు ఎంత త్వరగా వెళ్దామా అని తను తొందర పడుతోంటే ఈ ప్రయాణం అడుగడుగునా అంత ఆలస్యం అవుతోంది అని విసుక్కుంది. తల్లెమ్మ కోసం చూసింది. ఆ స్థలం అంతా జనంతో నిండి తొక్కిసలాటగా వుంది. కౌంటర్ల దగ్గర జనం గుమిగూడటంతో అంతా హడావిడిగా వుంది. అందరూ టిక్కెట్లు, వీసాలు, గ్రీనుకార్డులు చూపించి **hotel accomodation arrange** చేసుకోవటంలో బిజీగా వున్నారు. ఆ గలభాలో తల్లెమ్మ మానసికి కనిపించలేదు. **Airport** నుండి వాళ్ళు **arrange** చేసిన బస్ లో మానసి అందరితో పాటు **hotel** కి వెళ్ళిందన్న మాటే కానీ తల్లెమ్మ గురించే ఆలోచిస్తోంది. తీరా **hotel** లాబీలో అడుగు పెట్టేసరికి ఆమె ఆశ్చర్యపోయేలా అక్కడ తల్లెమ్మ కనిపించింది. మానసిని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లు చప్పున సోఫాలోంచి లేచి గబగబా ఆమె దగ్గరకి వచ్చింది తల్లెమ్మ. "ఎక్కడికెళ్ళావమ్మా? నీ కోసం అక్కడంతా చూసాను" అంది బెంగగా మానసి చేయి పట్టుకుంటూ. తప్పిపోయిన చిన్న బిడ్డకి హఠాత్తుగా ఎదురుగా తల్లి కనిపిస్తే ఎంత సంతోషంగా వుంటుందో అలా అనిపించింది ఆమె ముఖం మానసికి. "నేను ఫోను చేసి వచ్చేసరికి మనం ఇవాళ ఇక్కడే లండనులో వుండాలన్న కబురు తెలిసింది. అప్పటి నుండీ మీ కోసం చూస్తూనే వున్నాను. కానీ మీరు కనిపించలేదు. ఎక్కడికెళ్ళారు ఆంటీ? నాకంటే ముందుగా ఇక్కడికి ఎలా రాగలిగారు?" ఆశ్చర్యంగా అడిగింది మానసి. "మనందరం విమానం దిగి బయటకు రాగానే నువ్వు హఠాత్తుగా మాయం అయ్యావు. ఫోను చేసి వస్తానని నాకేమన్నా నువ్వు చెప్పావేమో, ఆ గలభాలో నాకు వినిపించలేదు. ఇంతలో జనంలో కోలాహలం మొదలైంది. అందరూ గోలగా ఏదో మాట్లాడుకుంటున్నారు. కొంతమంది కౌంటర్ల దగ్గరున్నవాళ్ళతో పోట్లాడటం మొదలెట్టారు. నాకేమీ అర్థం కాక అక్కడే కూర్చున్నాను. ఇంతలో ఆ **airport** లో పని చేసే అమ్మాయి కాబోలు, ఒకామె అక్కడకు వచ్చింది. **airport badge** పెట్టుకుని వుంది. నేనొక్కదాన్నే భయంగా అక్కడ కూర్చొని వుండటం చూసి నా దగ్గరకు వచ్చింది. ముందు ఏదో ఇంగ్లీషులో అడిగింది. నాకేమీ అర్థం కాలేదని తెలుసుకుని నా **passport** తీసుకుని, నా వివరాలు తెలుసుకుని నాతో తెలుగులో మాట్లాడటం మొదలెట్టింది. ఆ అమ్మాయి మన తెలుగమ్మాయే అట. ఇక్కడ **airport** లో పని చేస్తోందట. ఆ అమ్మాయే నన్ను నా సామానుతో సహా ఈ **hotel** వాళ్ళ బస్ లో ఎక్కించింది" అని వివరించింది తల్లెమ్మ. "అమ్మయ్య. అదృష్టవశాత్తూ ఆ **airport** అమ్మాయి మీకు సహాయం చేసింది. ఇంక నన్నొదిలి ఎక్కడికీ వెళ్ళకండి ఆంటీ. మళ్ళీ మీరు కనుమరుగైనారంటే నాకు ఆందోళనగా వుంటుంది" నిజంగానే ఆరాటంగా అంది మానసి. ఈ ప్రయాణంలో అయిన కొద్దిపాటి పరిచయంలోనే తల్లెమ్మతో ఎంతో ఆత్మీయత పెనవేసుకున్నట్లుగా వుంది ఆమెకు. ఆ **hotel** వాళ్ళతో మాట్లాడి తనకి, తల్లెమ్మకి కలిపి ఒకే **room** తీసుకుంది. ఆరోజు **hotel** లో తనే దగ్గరుండి ఆవిడకి భోజనం తినిపించింది. "ఇంత తక్కువ తింటారేమిటి ఆంటీ? మీకు ఆకలేయదా?" అని అడిగింది ఆవిడ తిండి చూసి ఆశ్చర్యపోతూ. "ఇంటినుండి బయట కొచ్చినపుడు, ముఖ్యంగా ఇలా ప్రయాణాలు చేస్తున్నపుడు ఆరోగ్యంగా వుండటానికి ముఖ్యమైన చిట్కా, ఇలా తక్కువ తినటం. తక్కువగా తినాలి. ఎక్కువ చలాకీగా వుండాలి. మా వయసులోవాళ్ళు ఇది పాటించటం ఇంకా ముఖ్యం" అంది ఆవిడ. మానసి అలాగా అన్నట్లు ఆవిడ వైపు చూసి నవ్వింది.

ఆ రాత్రి పడుకోవటానికి పక్క ఎక్కితే **hotel bed** ఎంత మెత్తగా సుఖంగా వున్నా మానసికి ఒకపట్టాన నిద్ర పట్టలేదు. మనసులో మళ్ళీ గుబులు మొదలైంది. 'బాబుకి ఇంకా జ్వరం తగ్గలేదుట. ఇప్పుడైనా తగ్గిందో లేదో? ఇండియాలో బేబీ ఎలా వుందో? ఏం చేస్తోందో? తన కోసం ఏడుపు మానిందో లేదో? ఈ ఇంజను రేపటిలోపు బాగవుతుందో లేదో? రేపైనా

ఇక్కటినుండి కదులుతామో లేదో? దేశం కాని ఈ దేశంలో ఇంకెన్నాళ్ళు వుండాలో?’ ఇలా ఆలోచిస్తూంటే మళ్ళీ మానసి మనసంతా అల్లకల్లోలమైపోయింది. పక్కకి చూస్తే తల్లెమ్మ ప్రశాంతంగా నిద్ర పోతూ కనిపించింది. ’ఎంత హాయిగా నిద్ర పోతున్నారు! కష్టాలలో కాలి కాలి శరీరంలోని శక్తి అంతా హరించుకుపోయింది ఈవిడకి. అయినా మనోబలంతో ముందుకి నడుస్తోంది. వయసయిపోయిందని, ఓపిక లేదని బాధ్యతలని దాటవేయటంలేదు. లేని శక్తిని తెచ్చిపెట్టుకుని, ఆ శక్తిని మించిన పనులు చేయటానికి ఆ వయసులో సముద్రాలు దాటటానికి కూడా సిద్ధం అయింది. మనసులో ప్రేమ వుంటే శరీరంలో శక్తి వస్తుందంటారు. ఇదే కాబోలు. జీవితంలో **positive attitude** మీ దగ్గ నుంచి నేర్చుకోవాలి ఆంటీ’ అనుకుంది తదేకంగా ఆమె పైపే చూస్తూ. మర్నాడు ఇంజను బాగయింది, ప్రయాణానికి సిద్ధం అవమన్నారు అందరినీ. విమానంలో కూర్చుని బయలుదేరిన తర్వాత "అమ్మయ్య. మన ప్రయాణం లోని చివరి అధ్యాయంలోకి అడుగు పెట్టాం ఆంటీ. అదృష్టవశాత్తూ ఇంకే ఆటంకమూ రాకుండా వుంటే ఇంకో ఆరేడు గంటల్లో న్యూయార్క్ లో వుంటాం" అంది మానసి తల్లెమ్మతో రిలీఫ్ గా. "ఏ ఆటంకాలూ రావనే అనుకోమ్మా! అన్నిటికీ ఆ వాయుపుత్రుడే వున్నాడు" అంది ఆవిడ సుందరాకాండ చదువుకుంటూ. మానసి ఒక్కసారి ప్రశాంతంగా వున్న ఆవిడ పైపు తదేకంగా చూసింది. "ఆంటీ! ఇన్నిచోట్ల ఇన్నిసార్లు టిక్కెట్లు, **passport** లు పర్సులోనుండి బయటకు తీయటంలో పొరపాటున ఏపైనా పోయాయంటే ఎన్ని చిక్కులొస్తాయో తలుచుకుంటేనే భయం వేస్తోంది. అసలు మనం ప్రయాణం మొదలెట్టినప్పటినుండీ ఇప్పటిదాకా అడుగడుగునా ఇన్ని ఆటంకాలు వచ్చినా, ప్రతి మజిలీలోనూ ఒక రాత్రి ఆగిపోవాల్సివచ్చినా, ఆఖరికి దేశం కాని దేశంలో చిక్కుబడిపోయినా కూడా మీ నిబ్బరం చెక్కు చెదరలెదు. అసలు భాష కూడా రాని మిమ్మల్ని ఒక్కరినీ మీవాళ్ళు ఎలా పంపించారు? అంతా సజావగా అయితే ఫరవాలేదు కానీ ఇంత దూర ప్రయాణంలో ఏ మజిలోనన్నా ఏ అనుకోని అవాంతరం వలనైనా ప్రయాణానికి అంతరాయం కలిగితే కనీసం భాషన్నా రాని మీరు ఏమయిపోతారేమోనన్న ధ్యాసన్నా మీ వాళ్ళకి రాలేదా?" ఆశ్చర్యంగా ఇంక వుండలేక అడిగింది మానసి. "హైదరాబాదు నుండి న్యూయార్కు దాకా **direct flight** అని మావారు దీనికి టిక్కెట్టు కొన్నారు. నేను ఇలా రావటం మా అబ్బాయికి, కోడలుకి అస్సలు ఇష్టం లేదు. చెప్పానుగా, దానికి నా మీద ప్రేమ కంటే, మా అమ్మాయితో వంతులు వేసుకోవటం కారణం. అందుకే అన్నీ మావారే చూసుకున్నారు. ఇలా అవాంతరాలు వస్తాయని మాత్రం ఆయన బహుశా ఊహించి వుండరు. లేక విమానంలో ఇంకా చాలామందే తెలుగువారు వుంటారని, ఒకవేళ అనుకోనిదేదన్నా అయితే భాష సమస్య లేకుండా నేను వారి దగ్గర నుండి తగిన సహాయం పొందగలనని బహుశా ఊహించారేమో! అసలు రాబోయే కష్టాల గురించి మనం అంతగా ఆరాటపడకూడదమ్మా! ఆ దయామయుడైన దేవుడు అన్ని వేళలా అందరినీ అనేక విధాల ఆదుకుంటూనే వుంటాడు. ఇప్పుడు చూడు, నాకే ఇబ్బంది లేకుండా నిన్ను పరిచయం చేసాడు. అలాగే ఎవరికి ఏ పరిస్థితికి తగ్గట్లు వారికి ఆ పరిస్థితిలో వారి అవసరానికి తగ్గట్లు ఎవరో ఒకరి ద్వారా సహాయం అందజేస్తాడు ఆ భగవంతుడు. ఇలా ఈ **imperfect** ప్రపంచాన్ని అడుగడుగునా **balance** చేయటమేనమ్మా ఆ సర్వాంతర్యామి పని" అంది తల్లెమ్మ ప్రశాంతంగా. "ఎంత బాగా చెప్పారు ఆంటీ!" అంది మానసి మనస్ఫూర్తిగా. కొన్ని కొన్ని విషయాలు ఎంత **simple** అయినా ఎవరైనా చెప్తే తప్ప మనం గుర్తించం. ఇప్పుడు తల్లెమ్మ మాటలు విన్న తర్వాత మానసికి జ్ఞానోదయం లాంటిదేదో కలిగినట్లు అయింది. ’నేను కూడా కొంచెం నిబ్బరంగా వుండటం నేర్చుకోవాలి. ఆంటీ చెప్పినట్లు మన కర్తవ్యం మనం చేస్తూ ఫలితాన్ని ఆ దేవుడికి వదిలేసి మనశ్శాంతిగా వుండాలి. ఈ లోపల హడావిడి పడితే ఒరిగేది ఏదీ లేదు. ఇంకో ఏడాదిలో బేబీకి అయిదేళ్ళు నిండుతాయి. అప్పుడు దాన్ని తెచ్చేసుకుంటే **Pre-K** లో చేర్పించవచ్చు. **Pre-K school** లో **after school care pgm** మరీ అంత **expensive** గా వుండదు. ఫరవాలేదు, బహుశా ఆ మాత్రం ఖర్చుకి తాము తట్టుకోగలరేమో! ఏడాదంటే ఎంతలో తిరిగొస్తుంది? రకరకాల కారణాల వల్ల ఇలా ఎంతమంది పిల్లల్ని ఇండియాలో వదలటం లేదు? ఇంతమాత్రానికే తను ఇలా బేలలాగా బెంబేలు పడితే ఎలాగ? పిల్లలన్నాక జలుబులు, జ్వరాలు రాకుండా ఎలా వుంటుంది? ఈ ముసలి వయసులో ఆంటీ తనకి భాష రాకపోయినా సరే, ఇంత దూరం ప్రయాణం చేసి, సముద్రాలు దాటి, దేశం కాని దేశం వెళ్ళటానికి సిద్ధమయ్యారు. ఆవిడ వయసులో సగం వున్న తను జీవితం లోని పరీక్షలకు ఇలా భయపడి అధైర్యపడుతోందేమిటి? లేదు, తను ధైర్యాన్ని కోల్పోదు. దేనికీ భయపడదు. ఆత్మవిశ్వాసంతో, ఆ దేవుడి మీద నమ్మకంతో ముందుకు అడుగు వేస్తుంది. ఈ మనసుని ఇంకెప్పుడూ బలహీనపడనివ్వదు’ రేపటి మీద ఆశతో గట్టిగా నిర్ణయించుకుంది మానసి. ఎవరి ఆలోచనలలో ఎవరున్నా విమానం ఎగురుతూనే వుంది. న్యూయార్కు దగ్గరకొస్తోంటే తల్లెమ్మ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "మళ్ళీ తిరిగి ఇండియా వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా వెళ్ళండి ఆంటీ. ఎవరినైనా తోడు చూసుకోండి. ఒక్కరూ వెళ్ళకండి" అంది ప్రేమగా మానసి. తల్లెమ్మ సరే అన్నట్లు తలూపింది.

న్యూయార్కు **airport** కి తల్లెమ్మ కూతురు, అల్లుడు వచ్చారు. మానసి భర్త, కొడుకు కూడా వచ్చారు. "అమ్మని చూడాలనిపించి ఓపిక చేసుకుని వచ్చాను. ప్రయాణంలో అన్ని ఆటంకాలు కలిగాయని తెలిసిన తర్వాత ఇంక మనసాగలేదు" అంది తల్లెమ్మ కూతురు. "బాబుకి జ్వరం తగ్గింది. అమ్మని చూస్తానని గొడవ చేస్తే వాడిని కూడా తీసుకొచ్చాను" అన్నాడు మానసి భర్త. తల్లెమ్మ మానసిని కౌగలించుకుని "మానసి ఈ ప్రయాణంలో నాకెంత సహాయం చేసిందో చెప్పలేను. నాకు......" అంటూ వాళ్ళమ్మాయితో ఇంకా ఏదో చెప్పబోతోంటే "నేనేం చేయలేదు. ఇంకా ఆంటీనే నాకు బోలెడంత సహాయం చేసారు. దిగజారిపోతూన్న నా ఆత్మవిశ్వాసాన్ని తన **positive attitude** తో పైకి లేవనెత్తారు. దేవుడి మీద  నమ్మకాన్ని గుర్తు చేసి, నా కర్తవ్య మార్గం ఏదో నాకు చూపారు" మనస్ఫూర్తిగా అంది మానసి. ఆమె అలా ఎందుకంటోందో వివరం ఎవరికీ అర్థం కాకపోయినా అందరూ నవ్వేసారు.